# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 4, ఆగస్టు 2026




# అంతర్జాతీయ అంతర్రాష్ట్ర నేరస్థుల గుట్టురట్టు..

- ఇద్దరు బంగ్లాదేశ్ వాసులు, ఒక భారతీయ నిందితుడు అరెస్ట్
- మావలలో జరిగిన చోరీ కేసును ఛేదించిన ఆదిలాబాద్ జిల్లా పోలీసులు
- బంగారం, వెండి, ఐఫోన్లు, ఐప్యాడ్, ద్విచక్ర వాహనం స్వాధీనం
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ఆగస్టు 3, ప్రభాతవార్త**

ఆదిలాబాద్ జిల్లా మావల పోలీస్ స్టేషన్ పరిధిలో కైలాష్ నగర్‌లో ప్రముఖ రాజకీయ నాయకుడు ఇంట్లో జరిగిన చోరీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించి, అంతర్జాతీయ అంతర్రాష్ట్ర స్థాయిలో నేరాలకు పాల్పడుతున్న ముఠాకు చెందిన ఇద్దరు బంగ్లాదేశ్ వాసులను, ఒక భారతీయ నిందితుడిని, మొత్తం ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,సోమవారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిందితుల వివరాలు బంగ్లాదేశ్ కు చెందిన మొహమ్మద్ జౌనీ అలీ, మొహమ్మద్ రహ్మత్ అలీ, భారత్‌కు చెందిన తరుణ్ సింగ్‌లు ఉన్నారన్నారు,ఈ దర్యాప్తులో ప్రధాన నిందితుడు మొహమ్మద్ జౌనీ అలీ 2015 సంవత్సరం నుంచి సుమారు 9 సంవత్సరాలుగా రాజస్థాన్, ఒడిశా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో సంచరిస్తూ ఇళ్లకు తాళాలు పగులగొట్టి చోరీలు, ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నట్లు మిగతా 2లో..



# నకిలీ ధ్రువపత్రాలు సృష్టించే గ్యాంగ్ ముఠా అరెస్ట్

- నకిలీ జనన, మరణ, వివాహ ధ్రువపత్రాలు, ఆధార్, ఓటర్, పాన్ కార్డులు సృష్టించిన ముఠా
- ఇచ్చోడ పోలీస్ స్టేషన్లో ఆరుగురిపై కేసు, ఐదుగురు అరెస్ట్
- కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఫింగర్‌ప్రింట్ స్కానర్, కెమెరాలు, మొబైల్ ఫోన్లు సహా ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం
- నకిలీ రబ్బర్ స్టాంపు, నకిలీ ఓటర్ ఐడి కార్డులు, నకిలీ బర్త్ సర్టిఫికెట్, ఇతర సర్టిఫికెట్లు స్వాధీనం
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ఆగస్టు 3,ప్రభాతవార్త**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ రికార్డులను నకిలీగా సృష్టించి ప్రజలను, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న ముఠాను పోలీసులు గుర్తించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం స్థానిక పోలీస్ ముఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను తెలియజేశారు. వివరాలను గుండాల గ్రామపంచాయతీ కార్యదర్శి మహ్మద్ లుక్మాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితులు గుండాల గ్రామపంచాయతీ కార్యదర్శి పేరుతో నకిలీ రబ్బర్ స్టాంపు తయారు చేసి, ఆయన సంతకాన్ని ఫోర్జరీ చేసి జనన, మరణ, వివాహ ధ్రువపత్రాలు, ఇంటి పన్ను ధ్రువపత్రాలు తదితర గ్రామపంచాయతీ పత్రాలను కంప్యూటర్ల ద్వారా తయారు చేసినట్లు గుర్తించారు. 2లో..

# 15.70 కోట్ల సీఎంఆర్ అక్రమ మళ్లింపు

- దండేపల్లిలో ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం కేసు
- రైస్ మిల్లర్ అరెస్ట్

**లక్షెట్టిపేట, ఆగస్టు 03, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో ప్రభుత్వ కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అక్రమ వినియోగం కేసులో రామ లక్ష్మణ్ ఇండస్ట్రీస్ యాజమాని గంప సంతోష్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని లక్షెట్టిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం, రబీ 2022-23, 2023-24 సీజన్లలో ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ కోసం రామ లక్ష్మణ్ ఇండస్ట్రీస్‌కు 9,244.206 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించింది. దీనికి అనుగుణంగా ప్రభుత్వానికి 6,286.059 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అందజేయాల్సి ఉండగా, మిల్లు యాజమాన్యం కేవలం 1,833.511 మెట్రిక్ టన్నులు మాత్రమే అప్పగించింది. మిగిలిన 4,452.548 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను అక్రమంగా మళ్లించి, సుమారు రూ.15.70 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని దుర్వినియోగం చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ కె. శ్రీకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రమణమూర్తి, ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపర్చగా, కోర్టు రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతోందని, ప్రభుత్వ ధాన్యం అక్రమ వినియోగానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# పెండింగ్ రెవెన్యూ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

- అధికారులకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశం
- భూ సమస్యలు, ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

**నిర్మల్, ఆగస్టు 03, ప్రభాతవార్త:**



జిల్లాలో రెవెన్యూ శాఖకు వచ్చిన ప్రజల దరఖాస్తులను ఏమాత్రం పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అంశాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. భూభారతి, ప్రజావాణి, మిగతా 2లో..



# మంచిర్యాలలో కాసాని షాపింగ్ మాల్ ప్రారంభించిన సినీ నటి కృతిశెట్టి

వివరాలు 2లో..

– మంచిర్యాల, ఆగస్టు 03, ప్రభాతవార్త

# అంతర్జాతీయ అంతర్రాష్ట్ర నేరస్థుల గుట్టురట్టు..

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడైందన్నారు. నిందితుడు అక్రమంగా భారతదేశంలోకి ప్రవేశించి నకిలీ ఆధార్ కార్డు పొందినట్లు కూడా విచారణలో తెలిందని తెలిపారు. ఇటీవల జూలై 11న బంగ్లాదేశ్ నుంచి భారతదేశంలోకి ప్రవేశించిన అనంతరం తన సహచరులతో కలిసి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర మీదుగా ఆదిలాబాద్ చేరుకుని మావల పోలీస్ స్టేషన్ పరిధిలో కైలాష్ నగర్ నందు చోరీకి పాల్పడినట్లు గుర్తించడం జరిగిందని తెలిపారు. నిందితులు పగటిపూట కుక్కర్లు, గ్రైండర్లు విక్రయిస్తున్నట్లు నటిస్తూ కాలనీల్లో సంచరించి ఇళ్లను రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైందని అన్నారు. ప్రధాన నిందితుడు మొహమ్మద్ జౌనీ అలీపై దేశంలోని పలు రాష్ట్రాల్లో 8 కి పైగా నేరాల కేసులు, సహ నిందితుడు తరుణ్ సింగ్‌పై 6కు పైగా కేసులు నమోదై ఉండగా, ముఠాలోని ఇతర సభ్యులపై కూడా వివిధ రాష్ట్రాల్లో పలు కేసులు నమోదై ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. కాగా నిందితుల వద్ద నుంచి మొత్తం 73.05 గ్రాముల బంగారం, 151.30 గ్రాముల వెండి, రూ. 4,270 నగదు, 5 ఐఫోన్లు, 2 శాంసంగ్ మొబైల్ ఫోన్లు, ఒక ఆపిల్ ఐప్యాడ్, నేరాలకు ఉపయోగించిన ఒక ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నాట్లు అలాగే స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి, ఇతర వస్తువుల మొత్తం విలువ సుమారు రూ. 8 లక్షలు ఉంటుందని తెలిపారు. కేసును చేదించడంలో కీలక పాత్ర పోషించిన మావల సీఐ బీడీ ప్రేమ్ కుమార్, సైబర్ క్రైమ్ ఎస్ఐ గోపికృష్ణ, సిబ్బంది త్రిశూల్ క్రైమ్ సిబ్బంది శ్రీనివాస్ తదితరులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, మావల సీఐ బీడీ ప్రేమ్ కుమార్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, సైబర్ క్రైమ్ ఎస్ఐ గోపికృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ధ్రువపత్రాలు సృష్టించే గ్యాంగ్ ముఠా అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

ఈ నకిలీ పత్రాల ఆధారంగా ఆధార్ సంబంధిత పత్రాలు, ఓటర్ గుర్తింపు కార్డులు, పాన్ కార్డులు తయారు చేసి అనర్హులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేలా చేసి తెలంగాణ ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు విచారణలో వెల్లడైందని ఆయన పేర్కొన్నారు. పోలీసుల విచారణలో ప్రధాన నిందితుడు నేరాన్ని చేస్తూ, మిగతా నిందితుల పాత్రను వెల్లడించడంతో వారి వద్ద నుంచి ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ సీపీయూలు, మానిటర్లు, ప్రింటర్లు, హార్డ్‌డిస్కులు, మొబైల్ ఫోన్లు, సుప్రీమా రియల్‌స్కాన్ జీ10 ఫింగర్‌ప్రింట్ స్కానర్, సిఎంఐ టెక్ కెమెరా, లాజిటెక్ వెబ్ కెమెరా తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపించి వాటిలోని డిజిటల్ ఆధారాలను సేకరించనున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితులు ఇప్పటివరకు ఎంతమంది పేర్లతో నకిలీ పత్రాలు రూపొందించారు, ఎవరెవరు వాటిని ఉపయోగించారు, మరెవరైనా ఈ కుట్రలో భాగస్వాములుగా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందన్నారు. అరెస్టు అయిన వారిలో కేశవపట్నం కు చెందిన షేక్ హరూన్, ఇస్లాంపురా కాలనీకి చెందిన అబ్దుల్ షఫీక్, అదే ప్రాంతానికి చెందిన షేక్ దిల్‌షాద్ అహ్మద్, హనుమాన్ కాలనీకి చెందిన అబ్దుల్ రహమాన్ ఖాన్, ఇస్లాంపురాకు చెందిన సయ్యద్ నౌషాద్‌లు ఉన్నారు, కాగా మరో నిందుతుడు అబ్రార్ అలీ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితులపై పలు సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్వీక్ సాయి కొట్టే, ఎస్‌హెచ్‌వో ఇచ్చోడా ఇన్స్పెక్టర్ కే నరేష్ కుమార్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ రెవెన్యూ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

సీఎం ప్రజావాణి, రెవెన్యూ సదస్సులు, సదాబైనామా వంటి భూ సంబంధిత దరఖాస్తుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నవాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్ వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, పరిష్కారం కాని వాటిని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. తిరస్కరించే దరఖాస్తులకు స్పష్టమైన కారణాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రజల వినతుల పరిష్కారంలో నిరక్ష్యం సహించబోమని హెచ్చరించారు. భూముల సర్వే, రీ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన నిఘా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మన ఇసుక వాహనం యాప్ ద్వారానే ఇసుక విక్రయాలు జరిగేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఏడీ ల్యాండ్ రికార్డ్స్ నరసింహమూర్తి, వివిధ మండలాల తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

## లింగాపూర్ మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

లింగాపూర్, ఆగస్ట్ 3, ప్రభాతవార్త.



లింగాపూర్ మండల ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిని ఈరోజు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మండలంలో ఎదురవుతున్న పలు తీవ్రమైన సమస్యలపై చర్చించి, వాటి తక్షణ పరిష్కారం కోసం వినతిపత్రం సమర్పించారు. రాముగుడా, పిట్టగూడ ,అల్లీగూడ ఖీమానాయక్ తండా, ఫూల్సింగ్ నాయక్ తండా, తారాయిగూడచొర్పల్లి, కంచనపల్లి, చింతచెట్టు లింగాపూర్ ,గ్రామాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల మండలంలో తీవ్రంగా దెబ్బతిన్న బ్రిడ్జిలకు తక్షణమే రవాణా సౌకర్యం పునరుద్ధరించి, నూతన బ్రిడ్జిలు నిర్మించాలి. ప్రకృతి ఒడిలోఉన్న మిట్టేసప్తలగుండం, జలపాతాన్ని ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. దీని ద్వారా స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. మండల రైతులు ఏటా మూడు పంటలు పండించేలా ప్రతి చేనుకి ఉచిత బోరు, ఉచిత విద్యుత్ కనెక్షన్, మోటార్ సౌకర్యాలు కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాలి. ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఐటీడీఏ ద్వారా ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇచ్చి, మండలంలోనే ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచాలి అని కోరారు. పై సమస్యలపై స్పందించిన ఐటీడీఏ పీవో త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాధవ్ రాజశేఖర్ సర్పంచ్, లింగాపూర్ పవార్ బబ్లు సర్పంచ్, ఎల్లపటర్ జాటోత్ రాహుల్ బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్, సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

## మంచిర్యాలలో వాహిని షాపింగ్ మాల్ ప్రారంభించిన సినీ నటి కృతిశెట్టి

మంచిర్యాల, ఆగస్టు 03, ప్రభాతవార్త

మంచిర్యాల పట్టణంలోని ఇక్బల్ హైమాద్ నగర్ రోడ్డులోని వాహిని షాపింగ్ మాల్‌ను సోమవారం సినీనటి క్రితి శెట్టి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాజామాన్యం వారు మాట్లాడుతూ వాహిని షాపింగ్ మాల్ ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. సినీనటి క్రితి శెట్టి మాట్లాడుతూ వాహిని షాపింగ్ మాల్ లో మంచి వేరేటి చీరలు, చిన్నపిల్ల బట్టలు, మెన్స్‌వేర్ చాలా వెరిటీలు వున్నాయి. పట్టణ ప్రజలు ఈ మంచి అవకాశం వినియోగించుకోవాలన్నారు. మీ ఇంట్లో ఎలాంటి శుభకార్యాలు ఉన్న మా వాహిని షాపింగ్ మాల్లో షాపింగ్ చేయలన్నారు. మా వాహిని షాపింగ్ మాల్ కస్టమర్ల కోసం మంచి మంచి ఆపర్లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో షాపింగ్ మాల్ యజమాని వేముల వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, అనిల్, ప్రశాంత్, శ్రీనివాస్, విష్ణు, వేణు గోపాల్ జాజు, నవనిత్ బంగ్, శ్రీరామ్ జాజు, దేవరాజు, నాగరాజ్, నటరాజ్, నందరాజ్, కొమురవెల్లి రవితేజ, గాజుల అరుణ్, తదితరులు ఉన్నారు.

## జంతర్ మంతర్ ధర్నాకు సన్నాహాల్లో కీలక ముందడుగు

### - సంఘం బైలాస్ ట్రూ కాపీల సేకరణ.. నూతన పేర్ల అమెండ్మెంట్‌పై అధికారులతో చర్చ

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :

జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి సంబంధించి సన్నాహాల్లో కీలక ముందడుగు పడింది. గత సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు సంఘం నాయకులు ఆదిలాబాద్‌కు వెళ్లి, 1980లో సంఘం రిజిస్ట్రేషన్ సమయంలో నమోదు చేసిన బైలాస్‌కు సంబంధించిన కాపీలు, ట్రూ కాపీలను సంబంధిత కార్యాలయం నుంచి సేకరించారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని సంబంధిత అధికారిని కలిసి, ప్రస్తుతం సంఘానికి కొత్త పేర్లను ఏ విధంగా అమెండ్మెంట్ చేయాలనే అంశంపై సమగ్రంగా చర్చించారు. అమెండ్మెంట్ ప్రక్రియకు అవసరమైన నిబంధనలు, విధివిధానాలు, ఇతర వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. త్వరలోనే సంఘం కొత్త పేర్ల అమెండ్మెంట్ ప్రక్రియను ప్రారంభించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయనున్నట్లు నాయకులు తెలిపారు. జంతర్ మంతర్ వద్ద చేపట్టనున్న ధర్నా నేపథ్యంలో సంఘానికి సంబంధించిన రికార్డులు, న్యాయపరమైన పత్రాలను సిద్ధం చేసుకోవడంలో ఈ చర్య కీలక ముందడుగుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు లెండు గురి శ్యామ్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదే వసంత్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నామ్‌దేవ్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌతూరి గోపాల్ పాల్గొన్నారు.







## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### - అధికారులకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశం

నిర్మల్, ఆగస్టు 03, ప్రభాతవార్త:



ప్రజల నుంచి వచ్చే ప్రజావాణి దరఖాస్తులను ఎలాంటి పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై, అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖలు సమన్వయంతో, బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులను సమర్పించారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేసి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులు తప్పనిసరిగా ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ విద్యాసంస్థలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, ఆ వివరాలను యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బర్కత్‌పుర అంగన్‌వాడీలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

### - ముర్రుపాలు అమృతంతో సమానం: వైస్ చైర్మన్ షోయబ్

నిర్మల్, ఆగస్టు 3, ప్రభాతవార్త:



ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డు బర్కత్‌పుర అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ షోయబ్ హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిడ్డ జన్మించిన వెంటనే అందించే తొలి గడ్డ పాలు అంటే ముర్రుపాలు శిశువుకు అమృతంతో సమానమని అన్నారు. తల్లిపాలు బిడ్డకు రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు, భవిష్యత్తులో వచ్చే అనేక ఆరోగ్య సమస్యల నుంచి రక్షణ కల్పిస్తాయని తెలిపారు. ప్రతి తల్లి తన బిడ్డకు కనీసం ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై సమాజంలో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఖానాపూర్ సెక్టార్ సూపర్వైజర్ ప్రేమలత, అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, అనుపమ, ఏఎన్ఎం పద్మ, ఆశ వర్కర్ సుప్రియ పాల్గొన్నారు. వార్డుకు చెందిన గర్భిణులు, బాలింతలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది తల్లిపాల ప్రయోజనాలపై వివిధ రకాల ప్రదర్శనలు, అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు.

# రెండో విడత గృహ నిర్మాణం లబ్ధిదారుల పరిశీలనను వేగవంతం చేయాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త :**

నిరుపేదల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం రెండో విడత గృహ నిర్మాణ పనులు, లబ్ధిదారుల పరిశీలన ప్రక్రియలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, గ్రామీణ అభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు అధికారి ప్రకాష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం రెండో విడతలో లబ్ధిదారుల డెస్క్ పరిశీలన ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 10లోపు, కెరమెరి మండలంలో 13 మాత్రమే పెండింగ్‌లో ఉన్నందున మంగళవారం నాటికి డెస్క్ పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. సిర్పూర్‌టి, కౌటాల, బెజ్జూర్, పెంచికల్‌పేట్, వాంకిడి, లింగాపూర్, రెబ్బెన తదితర మండలాలలో 100 కంటే తక్కువ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నందున శనివారం సాయంత్రంలోగా తప్పనిసరిగా పరిశీలన పూర్తి చేయాలని తెలిపారు. జాబితాలో లేని అర్హులైన హట్ డ్వెల్లర్స్ ఎవరైనా ఉన్నట్లయితే, వారి వివరాలను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సేకరించి, ఫోటోలతో సహా నిర్దేశిత ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఎల్1, ఎల్2, ఎల్3 జాబితాలలో లబ్ధిదారుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజావాణిలో అందిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ పరిశీలించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన 500 రూఫ్ రీప్లేస్‌మెంట్ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని, గోడలు బాగుండి, కేవలం పైకప్పు మార్చిడి అవసరమున్న ఇళ్లను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం ఆర్.సి. లెవల్‌లో ఉన్న 2 వేల 712 గృహాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, జైనూర్ మండలంలో 369 ఇళ్లు, కాగజ్‌నగర్, కెరమెరి ప్రాంతాలలో అధిక సంఖ్యలో నిర్మాణాలు కొనసాగుతున్నందున ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. బిల్లుల చెల్లింపుల విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదని, ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో విడుదలవుతాయని, ఈ విషయంపై గుత్తేదారులు, లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణ పనులను వేగవంతంగా పూ ర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డెస్క్ పరిశీలన, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, తప్పుడు వివరాలకు అవకాశం లేకుండా ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి నివేదికలను సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సహాయ ఇంజనీర్లు (ఏఈలు), ఏపీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## వర్షపు మట్టి, ఇసుక మేటల తొలగింపు

**బెల్లంపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త**

బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బెల్లంపల్లి పట్టణంలోని కొత్త బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై పేరుకుపోయిన మట్టి, ఇసుక మేటలను మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు కౌన్సిలర్లతో కలిసి జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా రహదారిపై పేరుకుపోయిన మట్టి, ఇసుక వల్ల వాహనదారులు, బాటసారులు ప్రమాదాల బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తక్షణమే పూడికను తొలగించి రోడ్డును చదును చేయించినట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రహదారులను పరిశుభ్రంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు చింతల వసంత, బేతి శ్రావణ్, స్థానిక నాయకులు నీలి కృష్ణ, పీక లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కొత్తపల్లి సర్పంచ్ వెంకటేశం

## మొక్కలను నాటి.. వాటిని సంరక్షించాలి

**తాండూర్, ఆగస్టు 3, ప్రభాతవార్త :**

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి.. వాటిని సంరక్షి ంచాలని కొత్తపల్లి, గోపాల్ నగర్ సర్పంచులు ఆకులు వెంకటేశం, గాట్ల నర్సయ్య కోరారు. మండలంలోని కొత్తపల్లి, గోపాల్ నగర్ గ్రామ పంచాయతీల శివారులో గల అటవీ ప్రాంతంలో సోమవారం వన మహోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, కూలీలతో కలిసి స్థానిక సర్పంచులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు.. మానవాళి మనుగడకు చెట్లే ఆధారమన్నారు పచ్చని చెట్లు, అడవులు, వనాలు ఎక్కడ ఉంటాయో అక్కడ చల్లని వాతావరణం ఉంటుందని, వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. మొక్కలు పెంపకంలో నిరక్ష్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ పంచాయతీ సెక్రెటరీ లక్ష్ముుుు ్మణ్, వార్డు మెంబర్ లింగమూర్తి, నాయకులు కట్కాల మల్లేష్, సిద్ధం అశోక్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్, కూలీలు, తదితరులు పాల్గొన్నారు

## మంచినీటి బావుల్లో క్లోరినేషన్

**తాండూర్, ఆగస్టు 3, ప్రభాతవార్త :**

తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ 1,2,3 వార్డుల పరిధిలోని మంచినీటి బావులలో సోమవారం పూడికతీత, క్లోరినేషన్, ప్లాట్ ఫామ్ నిర్మాణ పనులకు స్థానిక సర్పంచ్ ముడిమడుగుల సురేష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముడిమడుగుల సురేష్, ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎం.డి.ఈసా, వార్డ్ సభ్యులు ఒడ్నాల రమేష్, పుల్గం శ్రీకాంత్, నాయకులు సప్ప హరీష్, ముహ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభించిన సర్పంచ్ ముడిమడుగుల సురేష్

## మణుగూరు పీకే-2 డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టు సింగరేణికి దక్కడం హర్షణీయం

**- బీఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాతాడి శ్రీధర్‌రెడ్డి**

**నస్పూర్, ఆగస్టు 3, ప్రభాతవార్త**

మణుగూరు పీకే-2 డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టు వేలం ద్వారా సింగరేణి సంస్థకు దక్కడం ఎంతో హర్షణీయమని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాతాడి శ్రీధర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు సాధనకు నిరంతరం కృషి చేసిన బీఎంఎస్ జాతీయ నాయకుడు కే. లక్ష్మారెడ్డికి, సింగరేణి ప్రయోజనాలను పరిరక్షిస్తూ ప్రత్యేక శ్రద్ధ చూపిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి యూనియన్ తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు సింగరేణి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెబుతూనే, మరోవైపు ఈ ప్రాజెక్టు వేలంలో జెన్‌కోను సింగరేణికి పోటీగా నిలపడం కార్మికుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. ఈ విషయాన్ని బీఎంఎస్ ఎప్పటికప్పుడు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఈ ప్రాజెక్టు సింగరేణికే దక్కడం మణుగూరు ప్రాంత భవిష్యత్తుకు అత్యంత కీలకమని స్పష్టం చేసినట్లు వివరించారు. గత నెల 19, 20 తేదీల్లో కేంద్ర మంత్రి సింగరేణి పర్యటనకు వచ్చిన సమయంలోనూ బీఎంఎస్ తరఫున ప్రత్యేక విజ్ఞప్తి పత్రం సమర్పించినట్లు గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు సింగరేణికి దక్కడం వల్ల మణుగూరు ప్రాంత భవిష్యత్తుకు, వేలాది మంది కార్మికుల ఉపాధి భద్రతకు, సంస్థ అభివృద్ధికి గొప్ప భరోసా లభించిందని తెలిపారు. సింగరేణి ప్రయోజనాల కోసం రాజకీయాలకు అతీతంగా నిరంతరం పోరాడిన బీఎంఎస్ కష్టానికి ఈ విజయమే నిదర్శనమని నాతాడి శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు.



## తలసేమియా, సికిల్ సెల్ బాధితులకు పింఛన్లు.. ప్రభుత్వ నిర్ణయానికి పాలాభిషేకంతో కృతజ్ఞతలు

**- ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు**

**- సామాజిక భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి**

**మంచిర్యాల, ఆగస్టు,3 ప్రభాతవార్త**

తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు ఈ నెల 15వ తేదీ నుంచి నెలవారీ సామాజిక భద్రత పింఛన్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ మంచిర్యాల పట్టణంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఐబి చౌరస్తా వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, తలసేమియా, సికిల్ సెల్ బాధితుల కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో మానవతా దృక్పథంతో కూడుకున్నదని అన్నారు. సామాజిక భద్రతను బలోపేతం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ప్రజల సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, జిల్లా రెడ్ క్రాస్ అసోసియేషన్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం ప్రజలకు మిఠాయిలు పంచి ఆనందం వ్యక్తం చేశారు.



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న స్థానిక శాసనసభ్యులు ప్రేమ్ సాగర్ రావు

# ఎస్పీఎంలో వెరిఫికేషన్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

**- ఆగస్టు 10న జైల్ భరోను విజయవంతం చేయాలి - సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపు**





**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :**

సిర్పూర్ పేపర్ మిల్స్ (ఎస్పీఎం)లో కార్మిక సంఘాల గుర్తింపు (వెరిఫికేషన్) ఎన్నికలను వెంటనే నిర్వహించాలని, ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. సిర్పూర్ పేపర్ మిల్స్‌లో కార్మిక సంఘాల వెరిఫికేషన్ ఎన్నికల నిర్వహణ కోసం కార్మికులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 76వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా 75 మంది కార్మికులతో సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ.. భారత కార్మికోద్యమ చరిత్ర, కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ వల్ల కార్మికులకు కలిగే నష్టాలను వివరించారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కేసును ఉపసంహరించుకోవాలని, సిర్పూర్ పేపర్ మిల్స్ యాజమాన్యం హైకోర్టులో దాఖలు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకుని, కార్మిక సంఘాల గుర్తింపు (వెరిఫికేషన్) ఎన్నికల నిర్వహణకు అంగీకరించాలని భూపాల్ డిమాండ్ చేశారు. ఎన్నికలు నిర్వహించే వరకు కార్మికుల ఉద్యమం మరింత ఉధృతంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. సామూహిక నిరాహార దీక్షల ముగింపు సందర్భంగా ఆల్ ఇండియా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీమతి ఆతిత మాట్లాడుతూ.. కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వెరిఫికేషన్ ఎన్నికలు జరిగే వరకు కార్మికుల పక్షాన అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. 75 మంది కార్మికులతో సామూహిక దీక్షలు 76 రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు సంఘీభావంగా నిర్వహించిన సామూహిక నిరాహార దీక్షలో వివిధ విభాగాలకు చెందిన 75 మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెరిఫికేషన్ ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌ను బలంగా వినిపించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ ఉపాధ్యక్షుడు షబ్బీర్, సహాయ కార్యదర్శులు మొగిలి వెంకటేష్, జి. మహేష్, ఆర్. రాజన్న, అబ్దుల్ నబీ, జేఏసీ నాయకులు గోలేం వెంకటేశం, గోగర్ల రాములు నానాజీ, కె. రమణయ్య, అంబాల ఓదేలు, కూషణ రాజన్న, ముంజం శ్రీనివాస్, చెట్లవేణి రాజేష్ యాదవ్, బోళ్ళ శంకర్, కోరాల కృష్ణ, గడమళ్ళ మహేష్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



## వాహనాల బహిరంగ వేలం

**ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 3, ప్రభాతవార్త :**

జిల్లా అటవీ అధికారి కార్యాలయం వద్ద ఈ ఏడాది జనవరి 30న నిర్వహించిన వాహనాల బహిరంగ వేలం విజయవంతంగా పూర్తయిందని జిల్లా అటవీ అధికారి బాలామణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం ప్రక్రియలో మొత్తం 32 వాహనాలను విక్రయానికి ఉంచగా, వాటిలో 31 వాహనాలకు వేలం జరిగిందని తెలిపారు. ఈ వాహనాల విక్రయం ద్వారా ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ అటవీ డివిజన్లకు కలిపి రూ. 4,46,260 ఆదాయం సమకూరిందని తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు టెండర్ మొత్తం 96 దరఖాస్తు ఫారాలను విక్రయించగా ఒక్కో దరఖాస్తు ఫారం ధర 590 రూపాయలు కాగా, వాటి ద్వారా 56,640 ఆదాయం సమకూరిందని తెలిపారు. ఈ వేలం ప్రక్రియను ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో నిర్వహించడం జరిగిందని, ప్రభుత్వ ఆదాయాన్ని పెంపొందించడం జరిగిందని తెలిపారు.



## సేంద్రియ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన రైతులు

**కెరమెరి, ఆగస్టు 3, ప్రభాతవార్త:**

ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో,ఓ ఎఫ్ ఐ సహకారంతో సిర్పూర్ (యూ) మండలంలోని పుల్లారా సీతాగొంది గ్రామపంచాయతీలకు చెందిన రైతుల కోసం కెరమెరి మండలంలోని కేంద్రే బాలాజీ సేంద్రియ వ్యవసాయ క్షేత్రానికి సోమవారం సందర్శించారు ఈ సందర్భంగా రైతులు కేంద్రే బాలాజీ సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న వివిధ పంటలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం బాలాజీ తాను అనుసరిస్తున్న సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, పంటల నిర్వహణ విధానాలు, సేంద్రియ ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ పద్ధతులు పంటల సంరక్షణకు సంబంధించిన అంశాలను రైతులకు క్లుప్తంగా వివరించారు. అలాగే క్షేత్రంలో సాగు చేస్తున్న ప్రతి పంటను రైతులకు చూపించి వాటి ప్రత్యేకతలను వివరించారు.ఈ క్షేత్ర సందర్శన కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్లు బెరిగెడి సతీష్ రాథోడ్ గణేష్ పాల్గొన్నారు.

## ఎరువుల విక్రయ యాప్‌పై డీలర్లకు అవగాహన

**- వంజిరి రైతు వేదికలో సమావేశం**

**- పారదర్శకంగా ఎరువుల పంపిణీపై అధికారుల సూచనలు**

**కాగజ్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలం వంజిరి రైతు వేదికలో ఎరువుల విక్రయానికి సంబంధించిన ఎఫ్ఎఫ్ఎస్ (ఎరువుల విక్రయ వ్యవస్థ) యాప్‌పై ఎరువుల డీలర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. సిర్పూర్(టి), కాగజ్‌నగర్, పెంచికల్‌పేట, దహెగాం ప్రాంతాలకు చెందిన ఎరువుల డీలర్లు సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటి, కాగజ్‌నగర్ అదనపు వ్యవసాయ అధికారి జె. మనోహర్, మండల వ్యవసాయ అధికారులు రామకృష్ణ, గిరీషన్, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొని యాప్ వినియోగం, ప్రయోజనాలపై డీలర్లకు వివరించారు.కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ రూపొందించిన ఈ యాప్ ద్వారా సబ్సిడీపై అందించే యూరియా, డీఏపీ, ఎంఓపీ తదితర ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా నిర్వహించవచ్చని అధికారులు తెలిపారు. రైతులు మొబైల్ ద్వారా ముందుగానే ఎరువులను నమోదు చేసుకుని, తమకు అనుకూలమైన విక్రయ కేంద్రాన్ని ఎంచుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఆధార్ ఆధారిత ధ్రువీకరణ అనంతరం సంకేత సంఖ్య లేదా క్యూఆర్ కోడ్ ద్వారా డీలర్ వద్ద ఎరువులు పొందవచ్చని తెలిపారు. ఎరువుల నిల్వలు, విక్రయాల వివరాలను కూడా డీలర్లు యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. ఎరువుల నల్లబజారు, అధిక ధరలకు విక్రయించడం, అనవసర వస్తువులతో కలిపి విక్రయించడం వంటి అక్రమాలను అరికట్టి రైతులకు సకాలంలో నాణ్యమైన ఎరువులు అందించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. యాప్‌ను సమర్థవంతంగా వినియోగించి రైతులకు మెరుగైన సేవలు అందించాలని డీలర్లకు సూచించారు.ఎరువుల పంపిణీ వ్యవస్థను సాంకేతికంగా, పారదర్శకంగా మార్చడంతో పాటు రైతులకు సులభంగా ఎరువులు అందేలా చర్యలు చేపట్టడమే ఈ అవగాహన సమావేశం ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఎరువుల డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.




## కాగజ్‌నగర్ మండల వార్డు సభ్యుల ఫోరం కన్వీనర్‌గా చెట్టి వెంకటేష్

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :**



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా వార్డు సభ్యుల ఫోరం కాగజ్‌నగర్ మండల కన్వీనర్‌గా చెట్టి వెంకటేష్ నియమితులయ్యారు. ఈ మేరకు వార్డు సభ్యుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బోరం సురేష్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బోరం సురేష్ మాట్లాడుతూ వార్డు సభ్యుల సమస్యల పరిష్కారంతో పాటు స్థానిక ప్రజా సమస్యలపై చురుకుగా పనిచేస్తూ, ఫోరంను మండల స్థాయిలో మరింత బలోపేతం చేయడంలో చెట్టి వెంకటేష్ సమర్థవంతంగా పనిచేస్తారనే నమ్మకం ఉందన్నారు. తనకు ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు బోరం సురేష్‌కు చెట్టి వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. వార్డు సభ్యుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం కృషి చేస్తూ ఫోరం బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. వెంకటేష్ నియామకంపై వార్డు సభ్యుల ఫోరం నాయకులు, సభ్యులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## అవుట్ రీచ్ మ్యాప్ సంస్థ ద్వారా గిరిజన మహిళలకు చేయూత

**తిర్యాని, ఆగస్టు3,ప్రభాతవార్త**




అవుట్ రీచ్ మ్యాప్ సేవా సంస్థ మంచిర్యాల వారి అధ్వర్యంలో తిర్యాని మండలంలోని గడలపల్లి గ్రామంలో సోమవారం కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా 20 మంది గిరిజన మహిళలకు 4 నెలలు కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి, సబ్సిడిలో అర్హులైన వారికి కుట్టు మిషన్ సర్టిఫికేట్లు ఇస్తామని ఆ సంస్థ సెక్రటరి కేరోలిన్ విగ్ గారు తెలిపారు. అదే విధంగా స్త్రీలు స్వయం కృషితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిది బి. ప్రమోద్, గ్రామ సర్పంచ్ ఆత్రం శంకరమ్మ, ఉప సర్పంచ్ సోయ కట్టి, ట్యూటర్ సుశీల, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్త, చెట్ల తొలగింపు

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని కోయవాగు గ్రామపంచాయతీ పరిధిలోని 5వ వార్డులో విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పేరుకుపోయిన చెత్తాచెదారం, దట్టంగా పెరిగిన తుమ్మ చెట్లను పంచాయతీ సిబ్బంది తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెట్లు, చెత్త పేరుకుపోవడంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. విషయం గుర్తించిన గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి సిబ్బందిని అక్కడికి పంపించారు. ప్రమాదకరంగా పెరిగిన తుమ్మ చెట్లతో పాటు చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి తక్షణ చర్యలు చేపట్టిన గ్రామపంచాయతీ సర్పంచ్, కార్యదర్శి, పంచాయతీ సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.





## బైంసా-కుబీర్ రహదారి మరమ్మతులు చేపట్టాలి

### - ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు యువ నాయకుడు కంబ్లే సాహెబ్‌రావు విజ్ఞప్తి

**భైంసా, ఆగస్టు 03, ప్రభాతవార్త:**

భైంసా నుంచి కుబీర్ వెళ్లే ప్రధాన రహదారి, ముఖ్యంగా మీర్జాపూర్ నుంచి కుబీర్ వరకు పూర్తిగా దెబ్బతిని ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని ముధోల్ నియోజకవర్గ యువ నాయకుడు కంబ్లే సాహెబ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి అధ్వాన్నంగా మారిన రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీర్జాపూర్ నుంచి కుబీర్ వరకు రోడ్డు అక్కడక్కడా కొట్టుకుపోయి పెద్ద పెద్ద గుంతలు పడ్డాయని తెలిపారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ మార్గంలో ప్రయాణించడం నిత్యం ప్రమాదకరంగా మారిందన్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ముధోల్ నియోజకవర్గ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ఈ సమస్యపై తక్షణమే స్పందించాలని కోరారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడి దెబ్బతిన్న రోడ్డుకు వెంటనే ప్రత్యేక నిధులు మంజూరు చేయించి, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రయాణ కష్టాలను తీర్చాలని విజ్ఞప్తి చేశారు.



## బాసర అమ్మవారిని దర్శించుకున్న మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి

### - బాసర రోడ్ల అభివృద్ధికి రూ. 27 కోట్లు విడుదల

**భైంసా, జులై 03, ప్రభాతవార్త:**

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి దర్శించుకున్నారు. సోమవారం బాలాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి, ఈవో అంజనీ దేవి మాజీ మంత్రికి శాలువా కప్పి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బాసర రోడ్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ. 27 కోట్లు మంజూరు చేసిందని, పెండింగ్‌లో ఉన్న మరో రూ. 10 కోట్లు కూడా త్వరలోనే విడుదలవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అంజనీ దేవి, సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్, అష్ట సర్పంచ్ శ్రీను, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శాఖల సమన్వయంతో జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దాలి

### - నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, ఆగస్టు 03, ప్రభాతవార్త:**

జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు, అక్రమ గుట్కా రవాణా, విక్రయాల నిర్మూలనపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ, అటవీ, విద్య, వ్యవసాయ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల సాగు, నిల్వ, రవాణా, విక్రయం లేదా వినియోగాన్ని ఏ రూపంలోనూ ఉపేక్షి ంచరాదని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమ గుట్కా తయారీ, రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా కాపాడటం ప్రతి శాఖ బాధ్యత అని పేర్కొన్న కలెక్టర్, విద్యార్థి దశ నుంచే మాదకద్రవ్యాల వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువతలో చైతన్యం తీసుకురావాలని అన్నారు. ప్రతి ఒక్కరి సహకారంతో నిర్మల్ జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి సహా ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ నిరంతర చర్యలు చేపడుతోందని తెలిపారు. శాఖల సమన్వయంతో తనిఖీలు నిర్వహిస్తూ, మాదకద్రవ్యాల విక్రయం, రవాణాలో పాల్గొనే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పటిష్ట నిఘాతో పాటు యువత, విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్, జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శాంతి, భద్రతల పరిరక్షణే ధ్యేయంగా కార్డెన్ సెర్చ్: ఏఎస్పి సాయికిరణ్

**భైంసా, ఆగస్టు 03, ప్రభాతవార్త:**



బాసర మండల కేంద్రంలో నేరాల నియంత్రణకు కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు ఏఎస్పి సాయికిరణ్ తెలిపారు. నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు సోమవారం తెల్లవారు జామున 6 గంటలకు బాసర మండల కేంద్రంలోని బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 70 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలు, నంబర్ ప్లేట్ లేని 4 వాహనాలు, 1 లారీని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. గంజాయి, మత్తు పదార్థాల సరఫరా వంటి విషయాలు దృష్టికి వస్తే వెంటనే డయల్ 100ను సంప్రదించాలని లేదా నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముథోల్ సీఐ రవీందర్ నాయక్, బాసర సీఐ దీపక్, ముథోల్ ఎస్సై బిట్ల పర్సీస్, తానూర్ ఎస్సై జుబేరా, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జామ్ గ్రామంలో పశువులకు యాంటీ రేబీస్ టీకాలు

**సారంగాపూర్, ఆగస్టు 03, ప్రభాతవార్త:**



మండలంలోని జామ్ గ్రామంలో పశువులకు ముందుజాగ్రత్త చర్యగా యాంటీ రేబీస్ టీకాలు వేశారు. గ్రామంలో ఒక ఆవు పలువురిపై దాడి చేయడంతో దానికి రేబీస్ వ్యాధి వచ్చిందేమోనని గ్రామస్తులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ కరిపే రవళి విలాస్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతో ఆ ఆవును బంధించారు. సర్పంచ్ విజ్ఞప్తి మేరకు మండల పశువైద్యాధికారి డాక్టర్ నందకుమార్, వారి సిబ్బంది సోమవారం గ్రామంలోని పశువులన్నింటికీ యాంటీ రేబీస్ టీకాలు వేశారు. గ్రామస్తులు తమ పశువులన్నింటికీ తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని ఈ సందర్భంగా డాక్టర్ నందకుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సునీల్, ఎల్ఎస్ఏ రామకృష్ణ, అన్వేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ వెంటనే పూర్తి చేయాలి

### - అన్ని జిల్లాల కలెక్టర్లకు సీఈవో సుదర్శన్ రెడ్డి ఆదేశం

**నిర్మల్, ఆగస్టు 03, ప్రభాతవార్త:**



ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారముల డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా, ఎటువంటి తప్పులు దొర్లకుండా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌తో పాటు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియపై జిల్లాల వారీగా సీఈవో సమీక్షించారు. ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉంటే వాటిని ఒకే కేంద్రం కిందకు తీసుకువచ్చేలా రేషనలైజేషన్ పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ఒక కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్మల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ భవేశ్ మిశ్రా ఈ వీసీలో పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్ తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. సీఈవో ఇచ్చిన ఆదేశాలను వెంటనే అమలు చేస్తామని కలెక్టర్ భవేశ్ మిశ్రా ఈ సందర్భంగా తెలిపారు.

# అక్రమ రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

### సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్‌కు వినతిపత్రం అందజేత

**భైంసా, ఆగస్టు 03, ప్రభాతవార్త:**



ముధోల్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అక్రమ రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ బాలాజీ సుత్రవే కోరారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ముధోల్ రెవెన్యూ డివిజన్‌లో కొందరు రైస్ మిల్లర్లు ప్రభుత్వం ఇస్తున్న ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తూ, ప్రైవేటు వ్యక్తులకు అమ్మి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. బ్లాక్ లిస్ట్‌లో ఉన్న డిఫాల్టర్ రైస్ మిల్లులకు సైతం ధాన్యం కేటాయిస్తున్నారని తెలిపారు. అధికారులు రైస్ మిల్లుల గోదాములను తనిఖీ చేయడం లేదని పేర్కొన్నారు. రాజకీయ నాయకుల అండదండలు ఉండటంతో మిల్లర్లపై చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనుకాడుతున్నారని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించి, అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిల్లుల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో కపిల్ షిండే, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయి విడుదల చేయాలి

### రూ.15,000 కోట్ల పెండింగ్‌ను వెంటనే చెల్లించాలని బీజేవైఎం డిమాండ్ - నిర్మల్‌లో సంతకాల సేకరణ



**నిర్మల్, ఆగస్టు 3, ప్రభాతవార్త:**

తెలంగాణలో విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని భారతీయ జనతా యువ మోర్చా డిమాండ్ చేసింది. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని పలు కళాశాలల్లో బీజేవైఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సుమారు రూ.15,000 కోట్ల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, దీనివల్ల లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని బీజేవైఎం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిరక్ష్యం వల్ల కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించలేక విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల చదువులతో రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలు చేయడం సరికాదు. వెంటనే పెండింగ్ బకాయిలన్నింటినీ విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు. సంతకాల సేకరణ ద్వారా విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నామని, వాటిని రాష్ట్ర నాయకత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సూరజ్ నాయక్, సాత్విక్, బీజేవైఎం జిల్లా నాయకులు కందుల హరీష్, వెంకటేష్, భరత్, విజయ్, సృజన్, బంటి, చరణ్, దీక్షిత్, అనిల్, శ్రీకాంత్, మధు, ప్రణయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు సంతకాలు చేసి ప్రభుత్వ నిరక్ష్యంపై తమ నిరసన తెలిపారు.



## అంకత్‌పల్లి గ్రామ పంచాయతీ సందర్శించిన ఎంపీడీవో

**లక్షెట్టిపేట, ఆగస్టు 03, ప్రభాతవార్త**

మండలంలోని అంకత్ పల్లి గ్రామ పంచాయతీకి లక్షెట్టిపేట ఎంపీడీవో మధుసూదన్ మొదటి సారి వచ్చిన సందర్భంగా వారిని షాలువాతో గ్రామ సర్పంచ్ లింగంపల్లి లత వెంకటేష్, కార్యదర్శి కారకూరి ప్రదీప్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలపై చర్చించారు. అనంతరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ సమస్యలు, వివరాలు వివో బిల్డింగ్ గురించి, అంగన్వాడీ బిల్డింగ్ గురించి తెలిపారు. అలాగే మౌలిక సదుపాయాల గురించి, గ్రామ అభివృద్ధి గురించి వివరించారు. అలాగే గ్రామంలో నెలకొన్న కరెంటు సమస్య, కరెంట్ పోల్స్ 33, రోడ్స్ శాంక్షన్ అవసరం అని తెలిపారు. జీపీ బిల్డింగ్ కోసం మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేంసాగర్ రావు 20 లక్షల మంజూరి ఇచ్చారని, శాంతపూర్ లో సబ్ ప్లాన్ కింద 45 లక్షలు రోడ్స్, డ్రైన్స్ కోసం మంజూరు అయినట్లు తెలిపారు. అనంతరం ఎంపిడిఓ మధుసూదన్ సందర్శనలో భాగంగా తల్లిపాల వారోత్సవాలు లో భాగంగా అంకతపల్లి సెంటర్ ను విజిట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్, గ్రామ సర్పంచ్ లతా వెంకటేష్, కార్యదర్శి ప్రదీప్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి

**లక్షెట్టిపేట, ఆగస్టు 03, ప్రభాతవార్త**



లక్షెట్టిపేట పట్టణంలోని తిలక్ నగర్ కు చెందిన రాపల్లి రమేష్ అనే 45 సంవత్సరాల వ్యక్తి చెరువు నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతునికి చేపలు పట్టే అలవాటు ఉంది. మృతుడు ఆదివారం సాయంత్రం మహాలక్ష్మి వాడలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి రాత్రి వరకు ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం చెరువులో మృతదేహం కనిపించగా సమాచారం అందుకున్న కుటుంబీకులు చెరువు వద్దకు వెళ్లి చూడగా చెరువు నీటిలో చనిపోయి ఉన్నాడు. మృతుడు చేపలు పట్టడం కోసం చెరువు నీటిలో వల వేయగా అట్టి వల ఆయన కాలికి చేతికి చిక్కుకొని అదే చెరువులో పడి మృతి చెందారు. మృతుని తల్లి బుచ్చి రాజవ్వ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ అన్వర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వన సంరక్షణే భవిష్యత్‌కు భరోసా.. రాముని చెరువు వద్ద హరిత సందేశం

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మొక్కలు నాటిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

### - ప్రజలంతా మొక్కలను సంరక్షించాలని పిలుపు

**మంచిర్యాల, ఆగస్టు 3, ప్రభాతవార్త**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, నేడు నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు జీవనాధారంగా నిలుస్తుందని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 52వ డివిజన్ రాముని చెరువు వద్ద మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హరితహారాన్ని ప్రజల ఉద్యమంగా మార్చాలని, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పట్టణాలను మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, కార్పొరేటర్లు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొని మొక్కలు నాటి హరిత పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటిచెప్పారు.



## జాజులపేటలో బురదమయమైన రహదారి

### - రాకపోకలకు ఇబ్బందులు.. చర్యలు చేపట్టాలని గ్రామస్తుల విజ్ఞప్తి

**వేమనపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త**



వేమనపల్లి మండలం సుంపుటం గ్రామపంచాయతీ పరిధిలోని జాజులపేట వాటర్ ట్యాంక్ రోడ్డులో వర్షాల కారణంగా రహదారి బురదమయంగా మారింది. మానేపెల్లి సంజీవ్ ఇంటి సమీపంలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకల్లో అవస్థలు ఎదుర్కొంటున్నారు. వెంటనే స్పందించి రోడ్డుపై బురదను తొలగించి, నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.



## ముల్కలపేట అభివృద్ధికి గ్రామసభలో కార్యాచరణ

**వేమనపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త**

మండలంలోని ముల్కలపేట గ్రామపంచాయతీలో సోమవారం సర్పంచ్ ఒడిల కళ్యాణి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)లో భాగంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి చేపట్టనున్న అభివృద్ధి పనులపై గ్రామసభలో చర్చించి యాక్షన్ ప్లాన్‌ను రూపొందించారు. తాగునీరు, పారిశుద్ధం, వీధి దీపాలు, ఆరోగ్యం, విద్యతో పాటు గ్రామ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఒడిల కళ్యాణి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోర్కుటి నరేష్, పంచాయతీ కార్యదర్శి చైతన్య కుమారి, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఐకేపీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మణుగూరు బొగ్గు బ్లాక్ సాధన కార్మికుల ఐక్య ఉద్యమానికి లభించిన ఘన విజయం

### - ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగానే సాధ్యమైందన్న వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్

**నస్పూర్, ఆగస్టు 3, ప్రభాతవార్త**

మణుగూరు పీకే ఓసీ డీప్ సైడ్ బొగ్గు బ్లాకు వేలంపాటలో జెన్‌కో, సింగరేణి సంస్థలు పోటీ పడగా, చివరకు 6.5 శాతం రెవెన్యూ షేర్‌తో సింగరేణి ఈ బ్లాక్‌ను దక్కించుకోవడం కార్మికుల ఐక్య ఉద్యమానికి లభించిన ఘన విజయమని ఏఐటీయూసీ నేతలు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ కొనియాడారు. పోరాటాలు ఎప్పటికీ వృథా కావు అనే నినాదాన్ని ఈ విజయం మరోసారి రుజువు చేసిందన్నారు. వేలంపాట ప్రక్రియ నుంచి జెన్‌కోను తప్పించి, బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ చేపట్టిన నిరాహార దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలతో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పోరాటం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిందన్నారు. ఈ బొగ్గు బ్లాక్ సింగరేణికి దక్కడం వల్ల వేలాది మంది కార్మికుల ఉపాధి భద్రతతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు రక్షణ లభించిందని, భవిష్యత్తులోనూ ఇదే పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## అనారోగ్యంతో ఉన్న రమేష్‌ను పరామర్శించిన బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి

**బెల్లంపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త**

బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 22వ వార్డుకు చెందిన రాసపల్లి రమేష్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు సోమవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రమేష్‌తో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని, అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, ఎమ్మెల్యే వినోద్ సహకారంతో అన్ని విధాలా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు కొండంత భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బేతి శ్రావణ్, స్థానిక నాయకులు నీలి కృష్ణ, పీక లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# చదువుకు ప్రోత్సాహం.. దాతల సేవా స్ఫూర్తి

**- 50 మంది విద్యార్థులకు ఉచిత యూనిఫారాల పంపిణీ**



విద్యార్థులకు యూనిఫారాలను అందజేస్తున్న దాతలు



విద్యార్థులతో దాతలు, ఉపాధ్యాయులు

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని ఎంపీపీఎస్ జీడిచేను పాఠశాలలో 2వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న 50 మంది విద్యార్థులకు సోమవారం ఉచిత యూనిఫారాలను పంపిణీ చేశారు. మన అగ్రి టెక్ ప్రొప్రైటర్ సుమన్, ఆయన మిత్రబృందం దాతలుగా ముందుకు వచ్చి విద్యార్థులకు యూనిఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా దాత సుమన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. చిన్నారుల విద్యాభ్యాసానికి తనవంతు సహాయం అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అపారమైన ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉన్నారని, వారి విద్యాభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వామి అవుతానని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుల్లూరి బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. విద్యార్థుల సంక్షేమం, పాఠశాల అభివృద్ధిని తమ బాధ్యతగా భావించి ముందుకు వస్తున్న ప్రతి దాతకు పాఠశాల కుటుంబం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సహకారం భవిష్యత్తులోనూ కొనసాగి మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి భట్‌పల్లి కాంప్లెక్స్ హెచ్ఎం అనురాధ భాయ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు యూనిఫారాలను అందజేశారు. విద్యాభివృద్ధిలో సమాజం భాగస్వామ్యం కావడం అభినందనీయమని పేర్కొన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు శాంతికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నేటి యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించడం గొప్ప పరిణామమన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలను తమ సొంత పాఠశాలలుగా భావించి ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కర్ల లావణ్య చిరంజీవి, వార్డు సభ్యుడు శ్రీకాంత్, ఉపాధ్యాయులు అక్షిత, భవాని తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు యూనిఫారాలు అందించిన సుమన్, ఆయన మిత్రబృందానికి పాఠశాల తరఫున ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# బారెగూడలో మొబైల్ నెట్‌వర్క్ సమస్య పరిష్కారానికి చర్యలు

**- జియో, ఎయిర్‌టెల్ అధికారులకు సర్పంచ్ కోట వేణుగోపాల్ వినతి**

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :**





గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న మొబైల్ నెట్‌వర్క్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ బారెగూడ గ్రామపంచాయతీ సర్పంచ్ కోట వేణుగోపాల్ జియో, ఎయిర్‌టెల్ సంస్థల సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. బారెగూడ గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 630 ఇళ్లు, 2,500 మంది జనాభా ఉన్నారని, గ్రామంలో జియో, ఎయిర్‌టెల్ వినియోగదారులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ మొబైల్ సిగ్నల్ సరిగా అందకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తరచూ కాల్స్ మధ్యలో నిలిచిపోవడం, వినిపించకపోవడం, ఇంటర్నెట్ సేవలు మందగించడం వంటి సమస్యలతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నెట్‌వర్క్ సమస్య ప్రభావం విద్యార్థులపై కూడా పడుతోందని, ఆన్‌లైన్ తరగతులు, పరీక్షలకు సంబంధించిన సమాచారం, విద్యా సంబంధిత సేవలను పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఉద్యోగులు, ప్రభుత్వ సిబ్బంది, వ్యాపారులు తమ రోజువారీ కార్యకలాపాలకు అవసరమైన ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవడంలో అంతరాయాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులు వ్యవసాయానికి సంబంధించిన సమాచారం, వాతావరణ వివరాలు, ప్రభుత్వ పథకాలు, సేవల సమాచారాన్ని సకాలంలో పొందలేకపోతున్నారని వివరించారు. అదేవిధంగా మహిళలు, వృద్ధులు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ప్రజలు కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది, ఇతర అత్యవసర సేవలను సంప్రదించడంలో నెట్‌వర్క్ సమస్య తీవ్ర ఇబ్బందిగా మారుతోందని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. గ్రామంలో సాంకేతిక సర్వే నిర్వహించి, నెట్‌వర్క్ సమస్యకు కారణాలను గుర్తించాలని, అవసరమైతే కొత్త మొబైల్ టవర్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచి మెరుగైన కాలింగ్, ఇంటర్నెట్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలని జియో, ఎయిర్‌టెల్ అధికారులను సర్పంచ్ వేణుగోపాల్ కోరారు. గ్రామ ప్రజల ఇబ్బందులను సానుకూలంగా పరిశీలించిన సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. బారెగూడ ప్రజలకు మెరుగైన మొబైల్ నెట్‌వర్క్ సేవలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3, ప్రభాతవార్త :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీ యువరాజ్ మార్మాట్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)ఎం డేవిడ్ జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. లింగాపూర్ మండలం పిట్టగూడ గ్రామానికి చెందిన ప్రజలు వర్షాకాలంలో తాగు నీరు అందించాలని, పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108 ఏర్పాటు చేయాలని, రెబ్బెన మండలంలోని దేవలగూడ గ్రామంలో యూటర్న్ మూసివేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని, తక్షణమే తిరిగి ప్రారంభించాలని, దహెగాం మండలం కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన సజ్జాత్ అలీ ఖాన్ విరాసత్ హక్కుల పట్టా మార్పిడిని నిలిపివేయాలని, కెరమెరి మండలం సాంగ్వి గ్రామంకు చెందిన మొహర్లె రమేష్ సాంగ్వి గ్రామములో చేపట్టిన సీసీ రోడ్డు పనుల బకాయిలు ఇప్పించాలని, రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన పుల్లుభాయి తన 3 ఎకరాల భుములో ఫారేస్ట్ అధికారులు మొక్కలు పెడుతామని బెదిరిస్తునారని, దీనిపై జాయింట్ సర్వే చేసి కొత్త పట్టా ఇప్పించాలని, సిర్పూర్ మండలం మహాగావ్ గ్రామానికి చెందిన రాము రైతు భరోసా నిధులు తన ఖాతాలో జమ చేయాలని పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు బొగ్గు బ్లాక్ కేటాయింపు సింగరేణి కార్మికుల ఐక్యతకు నిదర్శనం

**- ఐఎన్‌టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు**

**నస్పూర్, ఆగస్టు 3, ప్రభాతవార్త**

మణుగూరు డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఈ నెల 1న సింగరేణి వ్యాప్తంగా 12 ఏరియాల జనరల్ మేనేజర్ కార్యాలయాల ఎదుట నిర్వహించిన మహా ధర్నాలు, ఆందోళనలు విజయవంతం అయ్యాయని ఐఎన్‌టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు సోమవారం ఒక ప్రకటనలో ఆనందం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మణుగూరు డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించడం సింగరేణి కార్మిక లోకానికి ఎంతో ఆనందదాయకమైన పరిణామమన్నారు. ఈ సందర్భంగా జెట్టి శంకర్ రావు మాట్లాడుతూ.. ఈ చారిత్రాత్మక విజయం సింగరేణి కార్మికుల ఐక్యత, నిబద్ధత, నిరంతర పోరాటానికి దక్కిన విజయఫలమని కొనియాడారు. సంస్థ భవిష్యత్తు, కార్మికుల ఉద్యోగ భద్రత, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం సాగించిన ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని తెలిపారు. ఈ సుదీర్ఘ ఉద్యమంలో పాల్గొని విజయాన్నిందించిన ప్రతి కార్మికుడికి, ఐఎన్‌టీయూసీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా తెలంగాణలోని అన్ని బొగ్గు బ్లాక్‌లు సింగరేణి సంస్థకే దక్కేలా న్యాయమైన, ప్రజాస్వామ్య పోరాటాలను ఐఎన్‌టీయూసీ కొనసాగిస్తుందని జెట్టి శంకర్ రావు స్పష్టం చేశారు. డాక్టర్ బి. జనక్ ప్రసాద్ గారి సమర్థవంతమైన నాయకత్వంలో కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు, సింగరేణి ప్రయోజనాలను కాపాడటంలో ఐఎన్‌టీయూసీ తన ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తుందని పేరొన్నారు.




## ఉచిత పోలీస్ కోచింగ్ ప్రారంభోత్సవం

### ట్రస్ట్ వనరులను సద్వినియోగం చేసుకోవాలి: చైర్మన్ మోహన్‌రావు పాటిల్

**భైంసా, ఆగస్టు 03, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో మోహన్‌రావు పాటిల్ స్టడీ సర్కిల్, మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత పోలీస్ కోచింగ్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్ స్పెక్టర్ నియామక నోటిఫికేషన్లను పురస్కరించుకుని ఈ శిక్షణను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకులు మోహన్‌రావు పాటిల్, ఆర్ఎస్ఎస్ నిర్మల్ జిల్లా సహ సంఘచాలక్ కృష్ణదాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు పాటిల్ మాట్లాడుతూ.. పోలీస్ ఉద్యోగ అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రజా ట్రస్ట్ అందిస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా నిలవాలన్నారు. ప్రభుత్వాలు మారినా, నియామక ప్రక్రియలో గందరగోళం ఏర్పడినా నిరుద్యోగ యువత నిరాశ చెందవద్దని, తప్పుడు ప్రచారాలను నమ్మకుండా తమ కృషి, పట్టుదలపై నమ్మకంతో ముందుకు సాగాలని కోరారు. అభ్యర్థులు ఆశయాలను సాధించుకునేందుకు ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైతే ఆర్థిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ దిగంబర్, జిల్లా కార్యవర్గ సభ్యులు దామోదర్, కౌన్సిలర్ దిలీప్, గోపాల్ దాస్, ఆకుల సుభాష్, జాదవ్ మనోజ్, పాపిన్వార్, నాయకులు, విలేకరులు, పోలీస్ అభ్యర్థులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు కమ్యూనిటీ హాళ్లకు స్థలం, నిధులు మంజూరు చేయాలి

### - జాతీయ మహిళా కాంగ్రెస్ కార్యదర్శి అదితకు మున్నూరు కాపు సంఘం నాయకుల వినతి

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గ కేంద్రాల్లో మున్నూరు కాపు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించి, అవసరమైన నిధులు మంజూరు చేయించాలని కోరుతూ జాతీయ మహిళా కాంగ్రెస్ కార్యదర్శి అదితకు మున్నూరు కాపు సంఘం (పటేల్స్) జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ పటేల్ వినతిపత్రం అందజేశారు. సోమవారం కాగజ్‌నగర్‌లోని అదిత నివాసంలో వినతిపత్రం సమర్పించారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గ కేంద్రాల్లో ఒక్కో చోట 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరయ్యేలా రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేయాలని కోరారు. కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తే సంఘ సభ్యుల సామాజిక, సాంస్కృతిక, విద్యా, యువజన, సంక్షేమ కార్యక్రమాలకు శాశ్వత కేంద్రాలుగా ఉపయోగపడతాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం ఎంతో అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, స్థలం, నిధుల మంజూరుకు కృషి చేస్తామని అదిత హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య, మున్నూరు కాపు సంఘం (పటేల్స్) జిల్లా ఉపాధ్యక్షుడు బొలిశెట్టి మహేష్, జిల్లా కార్యదర్శి అంగాల తిరుపతి, సిర్పూర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బొలిశెట్టి అరుణ, చింతల మానేపల్లి అలవాల పెంటన్న, పులిశెట్టి వెంకటేష్, పార్వతి సురేష్, పెద్దింటి హనుమంతు, కారింగుల చంద్రయ్య, సాయిదామ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**ఆసిఫాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త :**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వికసిత్ భారత్ సాధించాలంటే ముందుగా నషా ముక్త్ యువత అవసరమని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (మహిళలు) సంయుక్తంగా నిర్వహించిన ‖నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్‖ కార్యక్రమంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. మద్యం, డ్రగ్స్, తంబాకు వంటి వ్యసనాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని, విద్యార్థులు చదువునే తమ నిజమైన వ్యసనంగా మార్చుకుని ఉన్నత లక్ష్యాల కోసం కృషి చేయాలన్నారు. అదేవిధంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమగ్ర వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గిరిజన బాలికల విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యతో పాటు క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా యువత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలదని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, డీఆర్పీ రాథోడ్ నరేష్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. శారద, బి.ఎడ్. కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పేదల కళ్లలో వెలుగులు.. డా. కొత్తపల్లి శ్రీనివాస్ సేవలు

### తొమ్మిదేళ్లుగా ఉచిత కంటి వైద్య సేవలు.. ఈ వారం ll మందికి ఉచిత శుక్లాల ఆపరేషన్లు

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :**



పేదల జీవితాల్లో వెలుగులు నింపే లక్ష ్యంతో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి ్మ-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య సేవలు కొనసాగుతున్నాయి. సొసైటీ వ్యవస్థాపకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం కాగజ్‌నగర్‌లోని కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ వారం కంటి శుక్లాల సమస్యతో బాధపడుతున్న 11 మంది పేద రోగులను ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేసి, డా. శ్రీనివాస్ సొంత ఖర్చులతో సురక్షిత రవాణా, భోజన సదుపాయం కల్పిస్తూ బెల్లంపల్లి లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా డా. శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గత తొమ్మిదేళ్లుగా వేలాది మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించామని తెలిపారు. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ ఉచిత వైద్య శిబిరాల గురించి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి, కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ప్రకటించిన పరిహారం వెంటనే చెల్లించాలి

### - ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు బాధితులతో కలిసి వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్

**మంచిర్యాల, ఆగస్టు 3, ప్రభాతవార్త**



దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల్లో అకాల వర్షాల కారణంగా మరణించిన నలుగురు రైతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల చొప్పున పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బాధిత కుటుంబాలతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ రాములుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో రైతుల మృతిపై నిర్వహించిన ఆందోళన అనంతరం ప్రభుత్వం పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, అయితే మూడు నెలలు గడిచినా బాధిత కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక సాయం అందలేదని ఆరోపించారు. సీఎం సహాయ నిధి ద్వారా పరిహారం మంజూరు చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నప్పటికీ, ప్రక్రియ ముందుకు సాగడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల పరిహారాన్ని తక్షణమే విడుదల చేసి బాధితులను ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి లక్ష్యంగా యాక్షన్ ప్లాన్ రూపకల్పన

**వేమనపల్లి, ఆగస్టు 03, ప్రభాతవార్త**




మండలంలోని నీల్వాయి గ్రామపంచాయతీలో సోమవారం సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)లో భాగంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను రూపొందించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, ఆరోగ్యం, విద్య తదితర అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఆర్. సంతోష్ కుమార్ గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సయ్యద్ సాబీర్ అలీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాలి మధు, పంచాయతీ కార్యదర్శి బానోత్ పున్నం, పశువైద్య అధికారి పవన్ కుమార్, ఎఫ్‌బీఓ సుభాష్, ఎంఎల్‌హెచ్‌పిలు తేజస్వి, కీర్తి, ఏఎన్ఎం భాగ్య, ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీనివాస్, శంకర్, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ లక్ష్ముమ్మణ్, ఎఈవో మాళవిక, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఐకెపి సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.